క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



రెంజల్(బోధన్): నీలా గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఆరుగురికి నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్‌ల సహకారంతో లబ్ధిదారులకు త్వరితగతిన నిధులు మంజూరైనట్లు తెలిపారు. నాయకులు గంగాకృష్ణ, సుక్క సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లోని చిరు వ్యాపారులకు శుక్రవారం విశిష్ట పుడమిరత్న అవార్డు గ్రహీత సామాజిక సేవకుడు పట్వారీ తులసి కుమార్ ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

వర్ధంతి సభ



నందిపేట్(ఆర్మూర్): సీహెచ్ కొండూర్‌లో శుక్రవారం ప్రజాపంథా ఆధ్వర్యంలో అరుణోదయ కళాకారుడు రామారావు వర్ధంతి సభను నిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి కూలీల మధ్య రామారావు వర్ధంతి సభ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కె.గంగాధర్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

శ్రీరామ పాదుకలకు క్షీరాభిషేకం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని నగరేశ్వర మందిరంలో శనివారం ఉదయం 9 గంటలకు శ్రీరామపాదుకలకు క్షీరాభిషేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భద్రాచలంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీసుకువచ్చిన శ్రీరామ పాదుకలకు భక్తులతో క్షీరాభిషేకం చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు.. ఒక గ్లాస్ పాలు ఒక గ్లాసు నీళ్ల పువ్వులు తీసుకువచ్చి స్వయంగా అభిషేకం నిర్వహించుకోవచ్చన్నారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం శ్రీరామ పంచవటి క్షేత్ర ధర్మకర్త రామ్ రామ్ గురూజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి



బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో నిర్మిస్తున్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మెండోరా మండల కేంద్రంలో రోడ్డు పనుల్లో భాగంగా రోడ్డు పక్కన నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను వేగవంతం చేయాలన్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందుగానే పూర్తి చేసేలా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. బిల్లుల సమస్య లేకుండా ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు.

ఇచ్చిన హామీలు ఏమయ్యాయి..?



కమ్మర్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు ఇచ్చిన ఎన్నికల హామీలు ఏమయ్యాయని కమ్మర్‌పల్లి మండల బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వారు మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి.. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిపై చేసిన ఆరోపణలను నాయకులు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే సమాధానం చెప్పకుండా బీఆర్ఎస్ పాలనపై విమర్శలు చేస్తున్నారని మండి పడ్డారు. ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక మొహం చాటేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రేగుంట దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ కుంట ప్రతాప్‌రెడ్డి, నేతలు స్వామి, నోముల నరేందర్‌రెడ్డి, కొంటి కంటి నరేందర్, బద్రి, రవికిరణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

నవీపేట: మండలంలోని వివిధ గ్రామాలలో ఆరు నుంచి తొమ్మిదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు మే 10 నుంచి 25 వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో అశోక్ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్ అంశాలపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

సమష్టి కృషితో పెరిగిన ఆదాయం

- ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా ఆస్తిపన్నుల వసూళ్లలో ఆర్మూర్ మున్సిపాలిటీ టాప్
- ఎల్ఆర్ఎస్, ట్రేడ్‌లైసెన్స్‌లతో మున్సిపాలిటీకి భారీగా ఆదాయం



ఆర్మూర్‌టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం భూమి క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) కింద 2020లో దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీని ఉపయోగించుకున్నారు. సుమారు 1,200 మంది ప్లాట్ల యజమానులు ఫీజు చెల్లించడం ద్వారా ప్రభుత్వానికి రూ. 4.6 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పటివరకు, ఫీజు చెల్లించిన వారిలో 701 మందికి ప్రొసీడింగ్స్ కాపీలను కూడా ఇచ్చారు. మిగిలిన వారికి కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన అందరికీ కూడా ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నారు. ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను బకాయిదారులకు ఎర్లీబర్డ్ పథకం కింద కల్పించిన 5శాతం రాయితీని ఆర్మూర్ పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 40 శాతం ఇంటి యజమానులు ఏప్రిల్‌లో ఐదు శాతం రాయితీని ఉపయోగించుకొని తమ ఆస్తి పన్నులు చెల్లించారు. రూ.7.33 కోట్ల లక్ష్యానికి గాను రూ.2.35 కోట్లు వసూలు చేశారు.. రాష్ట్రంలోనీ 151 మున్సిపాలిటీల్లో 16వ స్థానంలో, ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది.

భారీగా ట్రేడ్ లైసెన్సుల జారీ

గతంలో పట్టణ పరిధిలో ట్రేడ్ లైసెన్సులు కేవలం 1,300 మాత్రమే ఉండేవి. వాటి ద్వారా మున్సిపల్‌కు సుమారు రూ.20 లక్షల ఆదాయం వచ్చేది. పట్టణంలో ఉన్న కమర్షియల్ ప్రాధాన్యతను గుర్తించి, ట్రేడ్ లైసెన్స్ టీమ్‌లను పది మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. వీరి వల్ల ఒక సంవత్సరం వ్యవధిలోనే సుమారు 1,200 ట్రేడ్ లైసెన్స్‌లు కొత్తగా తీసుకున్నారు.

సిబ్బంది సహకారంతో సాధ్యం



బల్దియాలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది సహకారంతో ఎర్లీబర్డ్ స్కీం, ఎల్ఎఆర్ఎస్, నూతన ట్రేడ్ లెసెన్సుల జారీ ద్వారా మున్సిపల్‌కు ఆదాయం సమకూరింది. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



రాజారాంనగర్ కాలనీవాసులతో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: ప్రజలు గంజాయి, కల్తీ కల్లు వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిస కావొద్దని ప్రొబేషనరీ ఐపీఎస్ సాయికిరణ్, ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని రాజారాం నగర్ కాలనీలో జిల్లా పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఆదేశాల మేరకు శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరు కూడా అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. బయటి రాష్ట్రాల, దేశాల నుంచి వచ్చిన వారికి అన్నీ తెలుసుకొని ఇళ్లు అద్దెకు ఇవ్వాలన్నారు. మొత్తం 170 ఇళ్లు తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని 76 వాహనాలు, 4 ఆటోలు, 1 కార్‌ను తాత్కాలికంగా స్వాధీనం చేసుకొని అనంతరం పత్రాలు అందజేసిన వాహనాలను అక్కడిక్కడే వదిలేశామన్నారు. అనుమానిత వ్యక్తులను వివరాలను సేకరించినట్లు తెలిపారు. నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్, నెంబర్‌లేని 15 వాహనాలను, 2 ఆటోలను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. సీఐలు శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, 9 ఎస్సైలు, 104 పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లు మంజూరు చేయాలి



పోతంగల్‌లో ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు

రుద్రూర్: అర్హులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ పోతంగల్ మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు బజరంగ్ హన్మాండ్లు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కొత్త పింఛన్లపై ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆసరా పింఛన్లు పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చి 16 నెలలు గడుస్తున్నా ఆ దిశగా ఆలోచన చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు సుధం అశోక్, సాయిలు, శంకర్, గంగారాం తదితరులున్నారు.

కూలి చెల్లింపులో జాప్యం లేకుండా చూస్తాం



పెర్కిట్(ఆర్మూర్): ఉపాధి హామీ కూలీలకు చెల్లించే కూలి విషయంలో జాప్యం లేకుండా చూస్తామని ఆలూర్ ఎంపీడీవో గంగాధర్ అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీల్లో భాగంగా ప్రజావేదిక నిర్వహించారు. కూలి పూర్తిగా పనుల కొలతల ఆధారంగా చెల్లిస్తామన్నారు. సమయపాలన పాటిస్తూ నిబద్ధతతో పనులు చేయాలని సూచించారు. సామాజిక తనిఖీ అధికారి నరేష్, సంతోష్, ప్రత్యేక అధికారిణి లక్ష్మి, జీపీ కార్యదర్శి రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌సీసీ ప్రారంభం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ డంపింగ్ యార్డులో భారతి మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొడి వ్యర్థాల వనరుల సేకరణ కేంద్రాన్ని(డీఆర్‌సీసీ) మున్సిపల్ కమిషనర్ రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పొడి వ్యర్థాలను గ్రేడుల వారీగా విభజించి వేరు చేయాలని సూచించారు. మెప్మా డీఎంసీ మాధురి లత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, ఈఈ పూర్ణమౌళి, మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, సీవో రాజలింగం, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూల మలుపు!



కొత్తపల్లిలో రోడ్డు పక్కన మూలమలుపు.. పక్కనే కల్వర్టు

- మూల మలుపు పక్కనే కల్వర్టు
- వాహనాలు అదుపు తప్పితే అంతే సంగతులు

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లిలో అంబేడ్కర్ విగ్రహం పక్కన గల రోడ్డు మూల మలుపు ప్రమాదకరంగా ఉంది. వాహనాలు అదుపు తప్పితే అంతే సంగతులు అన్నట్లుగా ఉంది. ఈ మధ్యనే రోడ్డు వెడల్పు పనులు చేపట్టారు. దీంతో రోడ్డు మూల మలుపు వద్ద ఉన్న కల్వర్టు వరకు వెళ్లింది. దీంతో మూల మలుపు వద్ద కల్వర్టు కూడ ప్రమాదకరంగా మారింది. ఓ వైపు గ్రామంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే దారి, మరో వైపు గ్రామంలోకి వెళ్లే దారి, ఇంకో వైపు ముప్కాల్ వెళ్లే దారి అన్ని ఇక్కడే కలిసి చౌరస్తాగా ఏర్పడింది. దీంతో వాహనాల రద్దీ ఎక్కువగానే ఉంటోంది. గతంలో ఇదే గ్రామంలో లక్ష్మి కాలువ డీ-3 పక్క నుంచి నిర్మించిన బైపాస్ రోడ్డు పక్కన ఎలాంటి రక్షణ లేకపోవడంతో గ్రామానికి చెందిన ఓ యువకుడు బైక్‌తో సహా కాలువలో పడి అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ మూల మలుపు వద్ద కూడా అలాంటి ప్రమాదమే పొంచి ఉంది. అధికారులు స్పందించి వెంటనే మూల మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు, గుంతలకు రోడ్డుపై నుంచి రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



వేల్పూర్: వేసవి దృష్ట్యా గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా జీపీ కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వేల్పూర్ మండల కేంద్రంలో హరితహారం నర్సరీని పరిశీలించారు. అనంతరం డీపీవో మాట్లాడుతూ.. వర్షాలు మొదలయ్యేనాటికి హరితహారం మొక్కలు పెరిగేటట్లు సంరక్షించాలని చెప్పారు. అదే విధంగా గ్రామాలలో ఎప్పటికప్పుడు డ్రైయినేజీలు శుభ్రం చేయించాలని పేర్కొన్నారు. డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీవో సాయిలు, జీపీ కార్యదర్శి వినోద్ ఉన్నారు.

రసాయన మందుల వాడకాన్ని నియంత్రించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సాయిచరణ్

జక్రాన్‌పల్లి: పంటలపై రసాయన మందుల వాడకాన్ని నియంత్రించాలని వరి పరిశోధన స్థానం రుద్రూర్ కీటక శాస్త్రవేత్త సాయిచరణ్ సూచించారు. శుక్రవారం జక్రాన్‌పల్లి రైతు వేదికలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు యూరియాను సిఫారసు చేసిన మోతాదులోనే వినియోగించాలన్నారు. ఎక్కువగా వాడకం వల్ల పంటరసం పీల్చే పురుగులు, ఇతర వ్యాధులకు గురవుతుందని తెలిపారు. రైతులు విత్తన, పురుగుల మందులను కొన్నప్పుడు తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. ఎప్పటికప్పుడు పంట మార్పిడి చేసుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న ఆధునిక పద్ధతులు ఉపయోగిస్తూ ఎక్కువ దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏవో దేవిక, కోటపాటి నర్సింహనాయుడు, తిరుపతిరెడ్డి, ఏఈవోలు శ్రీకాంత్, శివప్రసాద్, శంకర్, సుభాష్, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ

నిజామాబాద్‌నాగారం: రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని మారుతినగర్‌లో ఉన్న స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లోకరమణారెడ్డి హాజరై మాట్లాడారు. స్నేహ సొసైటీ, రోటరీ క్లబ్ లాంటి సంస్థలు కష్టాల్లో ఉన్న వ్యక్తులను, దివ్యాంగులను గుర్తించి వారికి సేవ చేయడం అభినందనీయం అన్నారు.

మాల మహానాడు మండల కమిటీ ఎన్నిక



నవీపేట : మండల కేంద్రంలో మాల మహానాడు మండల కమిటీని రాష్ట్ర అధ్యక్షులు చొక్కం దేవిదాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గౌరురాజు(జన్నేపల్లి), ఉపాధ్యక్షులుగా బత్తూరు సాయిలు(లింగాపూర్), సుధాకర్(బినోల), కార్యదర్శిగా శ్యామ్(నవీపేట), కోశాధికారిగా గైని మోహన్(రాంపూర్), ప్రచార కార్యదర్శిగా గైని సతీష్(అభంగపట్నం)లు ఎన్నికయ్యారు. జిల్లా కమిటీలో ఉపాధ్యక్షులుగా నీరడి బుచ్చన్న, సంగెం శ్రీనివాస్, కార్యదర్శిగా దొంత ప్రవీణ్‌లు ఎంపికయ్యారు.

ప్యాచ్‌లూ ధ్వంసమే..

- పెద్ద వాగు రోడ్డుపై ప్యాచ్‌లకు మళ్లీ ప్యాచ్‌లు వేయాల్సిన పరిస్థితి
- ఓవర్ లోడ్‌తో వస్తున్న మట్టి డంపర్లు
- మళ్లీ గుంతలు పడుతున్న రోడ్డు



కొత్తపల్లి శివారులో పెద్ద వాగు రోడ్డుపై ధ్వంసమైన ప్యాచ్

బాల్కొండ : ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామ శివారు జాతీయ రహదారి-44 నుంచి పెద్ద వాగు వరకు గల రోడ్డుపై వేసిన ప్యాచ్‌లు ధ్వంసమవుతున్నాయి. దీంతో మళ్లీ రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. ఓవర్ లోడ్‌తో నల్లమట్టి డంపర్లు వేగంగా రావడమే కారణంగా తెలుస్తోంది. పెద్ద వాగు రోడ్డు పునరుద్ధరణ కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.4 కోట్ల నిధులు మంజూరు చేశారు. అంతే కాకుండా పనుల కోసం శంకు స్థాపన కూడా చేశారు. కాని ప్రభుత్వం మారడంతో నిధులు రాక పనులు అటకెక్కాయి. దీంతో రోడ్డుపై ఏర్పడిన పెద్ద పెద్ద గుంతల్లో ప్యాచ్ వర్కు చేశారు. దీంతో గుంతల నుంచి కొంత ఇబ్బంది తగ్గింది. కాని మళ్లీ నల్ల మట్టి వాహనాలతో సమస్య మొదటికొచ్చింది. ఓవర్‌లోడ్‌తో పాటు, అతి వేగంగా లారీలు, డంపర్లు నడుపుతుండటంతో రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారుతోంది. అధికారులు స్పందించి ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని, రోడ్డుపై ఏర్పడిన గుంతలను మళ్లీ ప్యాచ్‌లు వేసి పూడ్చాలని వేడుకుంటున్నారు.

గుంతలు ఏర్పడ్డాయి..



పెద్ద వాగు రోడ్డుపై చేసిన ప్యాచ్ పనులు మొత్తం ధ్వంసమయ్యాయి. దీంతో మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. ఓవర్ లోడ్‌తో వాహనాలు రావడం వల్ల ఇలా జరుగుతోంది. గుంతలను వెంటనే పూడ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ప్రభాకర్, ప్రయాణికుడు

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

వర్ని: సబ్ స్టేషన్ నిర్మాణ పనులను వేగవంతంగా, నాణ్యతగా చేపట్టాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం జాకోరాలో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..లిఫ్ట్ ఇరిగేషన్ కోసం సబ్ స్టేషన్ నిర్మాణం చేపడుతున్నామని.. త్వరితగతిన సబ్‌స్టేషన్ పనులను పూర్తిచేస్తే విద్యుత్ సకాలంలో అందించగలుగుతామని.. తద్వారా రైతులకు సాగునీరు అందుతుందని వెల్లడించారు. జాకోరా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 9 గ్రామాల పరిధిలో 4,470 ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందుతుందన్నారు. విద్యుత్ శాఖ డీఈ ఎండీ ముక్తార్, డీఈ కన్‌స్ట్రక్షన్ వెంకటరమణ, ఏడీఈ నగేష్ కుమార్, ఈఈ కన్‌స్ట్రక్షన్ రాజశేఖర్, ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజనీర్లు నవీన్, బాలకిషన్ పాల్గొన్నారు.

మహారాణా ప్రతాప్‌సింగ్‌కు ఘననివాళి



నివాళులర్పిస్తున్న మండలి ప్రతినిధులు

బోధన్/బోధన్‌టౌన్: రాజస్థాన్ రాష్ట్రం మేవార్ రాజ్‌పుత్ రాజు, దేశ భక్తుడు మహారాణా ప్రతాప్ సింగ్ 486వ జయంతిని శుక్రవారం పట్టణ కేంద్రంలోని రాకాసీపేటలో సాయి ఆదర్శ యువతి మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూజలు చేసి అనంతరం నివాళులర్పించారు. మాతృదేశ రక్షణ కోసం తుది శ్వాస వరకు అసాధారణ ధైర్య సాహసాలతో పోరాడిన మహారాణా ప్రతాప్ సింగ్ జీవిత చరిత్ర భావితరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని మండలి ప్రతినిధులు అన్నారు. మండలి అధ్యక్షురాలు పద్మాసింగ్, నాయకులు మదన్ సింగ్, రాజేందర్ సింగ్, గోపి సింగ్, విజయ్ సింగ్, సంజయ్ సింగ్, రంజిత్ సింగ్, అక్షయ్ సింగ్, గీతసింగ్, రణ్వీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పీజీహెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వం పీజీహెచ్‌ఎంల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీజీహెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు శుక్రవారం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో నిర్వహించే ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక స్థాయి హెచ్‌ఎంలకు జిల్లా స్థాయిలో పీజీహెచ్‌ఎంలకు నిర్వహించే విధంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. అలాగే నూతన విద్యా సంవత్సరంలో నిర్వహించే కాంప్లెక్స్ సమావేశాల్లో పీజీహెచ్‌ఎంలకు కార్యదర్శి హోదా ఇవ్వాలన్నారు. ప్రాథమిక స్థాయిలో పర్యవేక్షణ కోసం అన్ని అర్హతలు ఉన్న పీజీహెచ్‌ఎంలకు మండల మాడల్ అధికారులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీజీహెచ్‌ఎంలు రచ్చ మురళి, ప్రశాంత్ రెడ్డి, సురేశ్‌రెడ్డి, నరేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీ



నవీపేట: ఉగ్రవాదుల అణచివేతలో భాగంగా జరుగుతున్న పాకిస్తాన్‌తో యుద్ధం చేస్తున్న ఇండియన్ ఆర్మీకి మద్దతుగా యంచ గ్రామంలో శుక్రవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

బోధన్‌టౌన్(బోధన్): ఐటీఐ పాసైన విద్యార్థులకు బోధన్ పట్టణంలోని ఐటీఐ కళాశాలలో ఈ నెల 12న అప్రెంటిషిప్, జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యాదగిరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభించే మేళాకు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటర్ మెకానిక్, డీజిల్ మెకానిక్, కోపా ట్రేడ్‌లో పాసైన వారు అర్హులన్నారు. ఈ మేళాలో వరుణ్ మోటార్స్, టాటా మోటార్స్, రుద్ర మోటర్స్, బజాజ్ ఆటో, సుభ్‌జిత్ స్టార్చ్‌మిల్స్, ప్రీమియం ఎనర్జీస్ లిమిటెడ్ వంటి వివిధ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు ఒక జత జిరాక్స్ సెట్, రెండు ఫొటోలు, బయోడేటా ఫాం తీసుకు రావాలని సూచించారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	రైడ్-2(హిందీ)-10.00, 1.00, 7.25, 10.25, రెట్రో-4.00
స్క్రీన్-2	హిట్-12.30, 3.45, 7.00, 10.15
స్క్రీన్-3	రెట్రో-11.30, 2.55, 6.20, 9.45
స్క్రీన్-4	హిట్-11.30, 2.45, 6.00, 9.15

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,200	వెండి(కిలో)	1,00,000
22 క్యారెట్స్	89,725		

– నిజామాబాద్ బిజినెస్